క్లుప్తంగా

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల: వేసవి సెలవుల సందర్భంగా కల్వటాలలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆదివారం సీఐ రమేష్‌బాబు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి 30 జట్లు పాల్గొంటున్నాయి. సీఐ మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించాలని సూచించారు. వివాదాలకు పోకుండా స్నేహపూర్వక వాతావరణంలో ఆడాలన్నారు. ఆటల్లో గెలుపోటములు సర్వసాధారణమన్నారు. క్రీడల వల్ల స్నేహం పెరిగి మంచి సంబంధాలు మెరుగుపడుతాయన్నారు. యువకులు చెడు అలవాట్లకు దూరంగ మెలగాలని కోరారు. కార్యక్రమంలో కల్వటాల క్రికెట్ టీం సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

64 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

బనగానపల్లె రూరల్: యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక కస్బా ఎంపీపీ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి స్పందన లభించింది. కంటి సమస్యలతో బాధపడుతున్న 64 మందికి నంద్యాలకు చెందిన శ్రీమీనాక్షి రెటీనా అండ్ కంప్లీట్ కేర్ సెంటర్ డాక్టర్ బీవీ క్రాంతి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి అద్దాలు, ఆపరేషన్లకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీవీ వరప్రసాద్, సహా అధ్యక్షుడు సత్యప్రకాష్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రతాప్, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న సభ్యులు

డోన్: స్థానిక ముల్లవారి వీధిలోని ఓ ఇంట్లో మృతిచెందిన వన్నూరమ్మ(43) అనే అనాథ మహిళ అంత్యక్రియలను ద్రోణాచలం సేవా సమితి ఆత్మబంధువు సభ్యులు ఆదివారం పూర్తి చేశారు. మహిళ మృతిచెందిన విషయం ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి సేవాసమితి సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. సమితి సభ్యులు గురుస్వామి, కానిస్టేబుల్ రామయ్య, మునిస్వామి హిందూ సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇందుకు శేఖర్, సురేష్ ఆర్థిక సాయం చేశారని సభ్యుడు షాధిఖాన రాజు తెలిపారు.

నిందితులపై కేసు నమోదు చేయాల్సిందే



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

డోన్ టౌన్: మూడు నెలల గర్భినిని హత్య చేసిన భర్త ఎల్లప్ప, అత్తమామ, బావలపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, ఆవాజ్ కమిటీ నాయకుడు చిన్న రహిమాన్ డిమాండ్ చేశారు. గోరంట్ల గ్రామానికి చెందిన చిన్నారిని(ఆమె పేరు) ఐదు నెలల క్రితం ఎరుకలచెర్వుకు చెందిన ఎల్లప్పకు ఇచ్చి వివాహం జరిపించారని.. అయితే గర్భవతి అని కూడా చూడకుండా చిత్ర హింసలకు గురిచేసి హత్య చేశారని.. కప్పి పుచ్చుకోవడానికి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపించారు. రాష్ట్రంలో మహిళా హోం మంత్రి ఉన్నా మహిళలకు భద్రత, రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసినా పోలీసులు ఇంత వరకు కేసు నమోదు చేయకపోవడం దారుణమన్నారు.

రాకపోకలకు అంతరాయం



రోడ్డుపై ఏర్పాటు చేసిన గంపలు, తోపుడు బండ్లు

డోన్ టౌన్: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టణంలో కోట్ల రుపాయాలతో అత్యాధునిక మార్కెట్ నిర్మించింది. అయితే కొందరు వ్యాపారులు అక్కడ విక్రయాలు జరపకుండా రోడ్డుపై వ్యాపారాలు చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతోంది. పాత బస్టాండ్ సమీపంలోని కూరగాయ మార్కెట్ వద్ద చిరు వ్యాపారులు రోడ్డుపై గంపలు, తోపుడు బండ్లు ఉంచడం కారణంగా భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. మున్సిపల్ అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వామ్మో.. వీధి కుక్కలు

- పట్టణాలు, గ్రామాల్లో విపరీతంగా పెరిగిన వీధికుక్కలు
- ఏటా పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- ప్రభుత్వాస్పత్రుల్లో మందుల కొరత
- పట్టించుకోని అధికారులు



డోన్ పాతబస్టాండ్‌లో నడిరోడ్డుపై తిష్టవేసిన వీధికుక్కలు



గాంధీ సర్కిల్‌లో సంచరిస్తున్న కుక్కలు

డోన్: వీధికుక్కల నియంత్రణకు ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోవడం వల్ల వాటి సంతాన ఉత్పత్తి విపరీతంగా పెరిగిపోయింది. డోన్‌లోని ప్రతి వీధిలో 30 నుంచి 40 కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. సరైన ఆహారం, నీరు లభించకపోవడంతో కుక్కల హార్మోన్లలో మార్పులు సంభవించి జనంపై దూకుడుగా వ్యవహరిస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2020లో వీధికుక్కల గణన చేపట్టారు. ఆ తర్వాత గణన చేపట్టకపోవడం.. సంతానోత్పత్తికి చర్యలు తీసుకోకపోవడం వంటి కారణాల వల్ల వీటి సంఖ్య విపరీతంగా పెరిగిపోయిందని చెప్పవచ్చు.

కర్నూలు జిల్లాలో 10,689, నంద్యాల జిల్లాలో 4,179తో కలిసి ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14,868 వీధికుక్కలు ఉన్నాయని 2020 గణన లెక్కలు చెబుతున్నాయి. డోన్, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల పరిధిలో 2024 మార్చి నుంచి 2025 మార్చి వరకు వీధికుక్కల కాటుకు గురైన వారి సంఖ్య 815గా నమోదైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కుక్క కాటుకు అవసరమైన వ్యాక్సిన్లు కూడా ప్రభుత్వాస్పత్రిలో అందుబాటులో లేకపోవడం దారుణ పరిస్థితిని తెలియజేస్తుంది.

విచ్చలవిడిగా మాంసం అంగళ్లు

డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి, బేతంచర్ల, డోన్ పట్టణాలతో పాటు అనేక మేజర్ పంచాయతీల్లో మాంసం దుకాణాలు, హోటళ్లు విచ్చలవిడిగా ఏర్పాటు చేయడం వల్ల వాటి వద్ద గుమిగూడే కుక్కల సంఖ్య కూడా విపరీతంగా పెరిగిపోయింది. మాంసం వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వీధుల్లో పారవేస్తుండడంతో వీధికుక్కల స్వైర విహారానికి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు.

వేసవిలో తస్మాత్‌జాగ్రత్త

సాధారణంగా వేసవిలో ఎండవేడిమి అధికంగా ఉండడంతో కుక్కలు తీవ్ర అసౌకర్యానికి గురవుతాయని పశువైద్యశాఖ అధికారులు చెబుతున్నారు. వేడి కారణంగా హార్మోన్లలో అనేక మార్పులు సంభవించి వీధికుక్కలు చికాకు పడతాయి. దీంతో దూకుడుగా జనంపైకి దాడికి ఉపక్రమించే అవకాశం ఉంది. వీధికుక్కల్లో ఒత్తిడి పెరగడం కూడా కుక్క కాటు సంఖ్య పెరగడానికి ప్రధాన కారణంగా పశువైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

కుక్కకాటు ప్రమాదకరం

వేసవిలో వీధికుక్కల కాటుకు గురైన వారు వెంటనే గాయం ఉన్న ప్రదేశాన్ని సబ్బునీటితో శుభ్రంగా కడిగి సమీపంలోని వైద్యుని వద్ద చికిత్స చేయించుకోవాలి. వారు సూచించిన విధంగా క్రమం తప్పకుండా టీకాలు వేయించుకోవాలి. ముఖ్యంగా కుక్కల దాడుల నుంచి తప్పించుకునేందుకు ప్రశాంతంగా ఉండడం, వాటికి దూరంగా వెళ్లడం, వాటి కదలికను నిశితంగా పర్యవేక్షిస్తూ ఉండడం ముఖ్యం. వాటిని భయపెట్టడం, ముఖాముఖి చర్యలకు దిగడం, పరిగెత్తడం వంటివి చేయకూడదు.

పట్టించుకోని అధికారులు

వీధికుక్కల సంఖ్యను తగ్గించేందుకు స్థానిక సంస్థలు నిధుల కొరత నెపంతో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయడం లేదని చెప్పవచ్చు. మున్సిపల్, గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక నిధులు ఉన్నా ఈ కార్యక్రమం చేపట్టడానికి సంబంధిత యంత్రాంగం చొరవ చూపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో మొక్కుబడిగా పశుసంవర్ధక శాఖ అధికారులు ఆస్పత్రులకు తీసుకొచ్చే పెంపుడు కుక్కలకు మాత్రమే రేబిస్ వ్యాధి సోకకుండా టీకాలు, కు.ని శస్త్రచికిత్సలు చేస్తూ వీధికుక్కలపై అశ్రద్ధ చేస్తున్నారు.

వేసవిలో జాగ్రత్తలు అవసరం



వీధికుక్కల కాటుకు గురి కాకుండా జనం వాటికి దూరంగా సంచరించడం ఉత్తమమైన మార్గం. వీధికుక్కలకు ముప్పుగా భావించే సంకేతాలు ఎలాంటి పరిస్థితుల్లో ప్రదర్శించకూడదు. కుక్కను భయపెట్టేలా ప్రవర్తించకూడదు. ఆకస్మికంగా కదలడం, వేగంగా పరిగెత్తడం వల్ల కుక్క కాటుకు గురయ్యే ప్రమాదం ఉంది. కుక్కలు దూకుడుగా ఉన్నప్పుడు మనం ప్రశాంతంగా ఉండగలిగితే కుక్క కాటు భారిన పడకుండా కాపాడుకోవచ్చు.

–డాక్టర్ నాగరాజు, పశుసంవర్ధక శాఖ ఏడీఏ, డోన్

రక్తదానం ప్రాణదానంతో సమానం



జవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న ఎస్ఐ, స్వచ్ఛంద సంస్థ సభ్యులు



రక్తదానం చేస్తున్న మహిళలు

బేతంచెర్ల: ప్రమాద సమయంలో బాధితులకు అందజేసే రక్తం ప్రాణ దానంతో సమానమని ఎస్ఐ రమేష్ బాబు, పారిశ్రామిక వేత్తలు గౌరి హుసేన్‌రెడ్డి, బూషిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని లైఫ్ యువనేత్ర సేవా సమితి, ఇండియన్ రెడ్ క్రాస్ సభ్యులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఎస్ఐ ప్రారంభించారు. అనంతరం పాకిస్తాన్ కాల్పుల్లో వీరమరణం పొందిన మురళీ నాయక్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయా కాలనీలకు చెందిన యువకులు, పారిశ్రామిక వేత్తలు, మహిళలు స్వచ్ఛందంగా పాల్గొని 102 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మహమ్మద్ రఫీ, రెడ్ క్రాస్ సభ్యుడు నాగ సురేంద్ర పాల్గొన్నారు.

జవాన్ మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



బేతంచెర్లలో నివాళులర్పిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు



డోన్‌లో సంతాపం వ్యక్తం చేస్తున్న ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సభ్యులు

కోవెలకుంట్ల: జమ్మూకాశ్మీర్‌లో పాక్‌తో జరిగిన పోరాటంలో వీర మరణం పొందిన జవాన్ మురళీ నాయక్ మృతికి ఆదివారం కోవెలకుంట్లలో పలువురు నివాళులర్పించారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి ఇంటి ఆవరణలో మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి కొవ్వొతులు వెలగించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన మురళీనాయక్ దేశం కోసం వీరోచిత పోరాటం చేసి వీరమరణం పొందారని కొనియాడారు. ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సంజామల మాజీ జెడ్పీటీసీ చిన్న బాబు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో రైతు సంఘం నాయకుడు కానాల రవీంద్రనాథరెడ్డి, ఏపీ ఎన్‌జీఓ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గువ్వల రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు రాంభూపాల్‌రెడ్డి, ధనిరెడ్డి నాగేశ్వరరెడ్డి, నాయకులు దశరథరామరెడ్డి, సుధాకర్‌రెడ్డి, గోపిరెడ్డి నాగేశ్వరరెడ్డి, డీసీ ఉసేన్, అక్బర్‌బాషా, అన్వర్, జనార్దన్, మధు, చాంద్, శివ, బాలతిమ్మయ్య, ఈశ్వరరెడ్డి, జాకీర్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

- **బేతంచెర్ల:** పాకిస్తాన్ దాడిలో వీర మరణం పొందిన మురళీనాయక్ చిత్రపటానికి స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం నివాళులర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు ఉదయ్, క్రిష్ణ, ప్రదీప్ పాల్గొన్నారు. సైనికుల త్యాగాలు మరువలేనిదని కొనియాడారు.

ప్రభుత్వ పెన్షనర్ల నివాళి

డోన్: పాకిస్తాన్ దాడిలో వీరమరణం పొందిన జవాన్లకు ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మురళీనాయక్‌తో ఇతర జావాన్ల మృతికి సంతాపం వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుసింగ్, గౌరవాధ్యక్షుడు సుబ్బరాయుడు, కార్యదర్శి గాలయ్య, కోశాధికారి గోపాల్, సభ్యులు రాందాస్‌రెడ్డి, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.




కోవెలకుంట్ల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

కోవెలకుంట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. పాఠశాలలో 2000–2001విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న దాదాపు వంద మంది పూర్వ విద్యార్థులు ఒక వేదికపై చేరారు. కొందరు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, కర్నూలు, వైఎస్సార్ కడప, అనంతపురం, తదితర ప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్లు, వివిధ శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్మీ, ప్రభుత్వ రంగ బ్యాంకులు, వ్యాపార, వాణిజ్య, రియల్ ఎస్టేట్‌తో పాటు వివిధ హోదాల్లో ఉన్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో వారంతా ఒక చోట చేరి అప్పటి జ్ఞాపకాలు, మధుర స్మృతులు, అల్లరి చేష్టలను పంచుకున్నారు. వారు చదివిన పాఠశాలను సందర్శించి అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం అప్పట్లో విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు పీసీ ఈశ్వరయ్య, రాజయ్య, వెంకట్రాముడు, నాగేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, రమణయ్య, రాఘవచారిలను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు గోపిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, వినయ్, కృష్ణారెడ్డి, మల్లి, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

మలుపులో ముళ్ల పొదలు తొలగింపు



జేసీబీతో ముళ్ల పొదలు తొలగింపు పనులు

కొలిమిగుండ్ల: స్థానిక కస్తూర్బా సమీపంలోని ప్రధాన రహదారిపై ఉన్న మలుపు తరచూ ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. వారం వ్యవధిలో రెండు సార్లు ఈ ప్రాంతంలో ప్రమాదాలు చోటు చేసుకోవడంతో పోలీసులు చర్యలు చేపట్టారు. ఆదివారం మలుపు సమీపంలో ఏపుగా పెరిగిన చెట్లను జేసీబీ సాయంతో తొలగించారు. 544–డీ జాతీయ రహదారి కావడంతో ఈమార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మలుపు సమీపంలో ముళ్ల పొదలు పెరిగిపోవడం, రాళ్ల వ్యర్థాలు పడేయంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వారం క్రితం లారీ, కారు ఢీకొనడంతో ఇటిక్యాలకు చెందిన ఏసురత్నం మృతి చెందాడు. రెండు రోజుల క్రితం రాత్రి ఆర్టీసీ బస్సు, కనకాద్రిపల్లెకు చెందిన బొలెరో జీపు ఎదురెదురుగా ఢీకొనడంతో బులెరోలో నలుగురు గాయపడగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. గతంలో పలు ప్రమాదాలు చోటు చేసుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. పోలీసులు మలుపు వద్ద చెట్లు తొలగించడంతో వాహనదారులకు కొంత వరకు ఉపశమనం కలుగుతుంది.

నేడు డయల్ యువర్ డీఎం

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ డిపోలో ప్రజారవాణా సమస్యలపై సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించ తలపెట్టినట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. డిపో పరిధిలోని ఆయా రూట్లలో తిరిగే బస్సు సర్వీసులపై సూచనలు, సలహాలు, ఫిర్యాదులు అందజేయాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. 9959225798 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలని సూచించారు.

వివాహ వేడుకలో కాటసాని

బనగానపల్లె రూరల్: మండలంలోని పసుపల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త తలారి పుల్లయ్య కుమారుడు హనుమాన్‌కుమార్ వివాహం ఆదివారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎస్.జనార్దన్‌రెడ్డి, నాయకులు నాగమహేశ్వరరెడ్డి, నాగలింగప్ప, రాజేశ్వరప్ప, రామనాయుడు, నాగరాజు, రమేష్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

సంజామల: మండలంలో వ్యవసాయ రంగానికి సోమవారం నుంచి వారం పాటు ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఈ సమయాల్లో విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న సీఐ

బేతంచెర్ల: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, లాడ్జీలను పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలకు, ప్రయాణికులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎవరైనా అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్నట్లు గుర్తిస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: వెల్దుర్తి 33 కేవీ లైన్ ఫీడర్ షిఫ్టింగ్ పనుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. జగదుర్తి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని చెప్పారు. వ్యవసాయానికి ఇచ్చే త్రీఫేస్ కరెంటు సోమవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి 10 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

వైభవం.. లక్ష్మీ నరసింహుని కల్యాణం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



బేతంచెర్ల: స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

డోన్: మండలంలోని యాపదిన్నె గ్రామంలో లక్ష్మీ నరసింహస్వామి జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున భూదేవి, శ్రీదేవితో నరసింహస్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. దాతలు చంద్రశేఖర్ రెడ్డి, మహేశ్వరి, మహేశ్వరరెడ్డి, జయంతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. రాత్రి ప్రొద్దుటూరుకు చెందిన బృందంతో నిర్వహించిన ఆర్కెస్ట్రా ఆకట్టుకుంది.

ఘనంగా నృసింహుని జయంతి వేడుకలు

బేతంచెర్ల: సంజీవనగర్ కాలనీ సమీపంలోని కొండపై వెలసిన గట్లనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆయా కాలనీలకు చెందిన భక్తులు స్వామికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేశారు. భజన కృష్ణయ్య ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా, విష్ణు సహస్రనామ పారాయనం జరిగింది.

ఉత్సాహంగా అమ్మలకు నడక పోటీలు



విజేతలతో ఇన్నర్వీల్ క్లబ్ సభ్యులు

డోన్: మాతృ దినోత్సవం సందర్భంగా ఇన్నర్వీల్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూనగర్ పార్కు వద్ద మహిళలకు నడక పందెం నిర్వహించారు. మహాలక్ష్మీ నర్సింగ్ హోం నిర్వాహకులు డాక్టర్ బాలచంద్రారెడ్డి, డాక్టర్ అనిత ఆర్థిక సహాయంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 3, 5, 8 కిలోమీటర్ల నడక పందెంలో 100 మంది మహిళలు పాల్గొన్నారు. హెల్త్ మాం, స్ట్రాంగ్ మాం, సూపర్ మాం టైటిళ్ల కింద ప్రథమ బహుమతి రమణమ్మ, ద్వితీయ బహుమతి వసుంధర, తృతీయ బహుమతి చంద్రిక గెలుచుకున్నారు. విజేతలకు మహాలక్ష్మి నర్సింగ్ హోం వైద్యుడు వెంకటేష్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు మద్దమ్మగౌడ్, కార్యదర్శి శకుంతలారెడ్డి, సభ్యులు షాలిని, సప్తశైల సుమిత్ర రాజేష్, ముడియాల శైలజ, ఇన్నర్వీల్ వ్యవస్థాపకురాలు రాజా సుజాత, సభ్యులు నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవుని ఉత్సవాలకు నూతన రథం సిద్ధం

- రూ.45 లక్షలతో చేయించిన చల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి



పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి



నూతన రథం

అవుకు: పట్టణంలో భూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి తిరు కల్యాణ మహోత్సవాలు ఏటా అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. రథోత్సవం రెండు రోజుల పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో కనుల పండువగా జరుగుతాయి. అయితే కొన్నేళ్ల క్రితం ఉత్సవమూర్తుల రథం శిథిలావస్థకు చేరుకోవడంతో ఏటా తాత్కాలికంగా రథన్ని ఏర్పాటు చేసి తిరు కల్యాణోత్సవాలను నిర్వహిస్తున్నారు. గత ఏడాది ఈ విషయం వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి దృష్టికి రావడంతో ఎంత ఖర్చు అయినా తన సొంత నిధులు వెచ్చించి నూతన రథాన్ని తయారు చేయిస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు తిరు కల్యాణోత్సవాల సమయానికి రూ.45 లక్షలతో నూతన రథాన్ని తయారు చేయించి, అవుకుకు తీసుకొచ్చారు. నూతన రథానికి కలశ స్థాపన కార్యాక్రమాలను ఆదివారం చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా నిర్వహించారు. ముందుగా రథానికి గణపతి పూజ, పుణ్యాహావాచనం, నవగ్రహ పూజ, ప్రాణ ప్రతిష్ట, సంప్రోక్షణ, రథాంగహోమం, కలశాభిషేకం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను చేపట్టారు. నూతన రథాన్ని చేయించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. చల్లాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 15, 16వ తేదీల్లో జరిగే రథోత్సవ కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు చల్లా తెలిపారు.

పందులదొడ్డిగా పార్కులు

డోన్: గత వైఎస్సార్‌సీపీ హయాంలో డోన్‌లోని పార్కులు పచ్చదనానికి, పరిశుభ్రతకు నిలయాలుగా ఉండేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్కుల నిర్వహణ గాలికొదిలేయడంతో బందెలదొడ్డిగా మారాయి. తారకరామనగర్ పార్కు ఫెన్సింగ్‌ను టీడీపీ కార్యాలయం దారి కోసం తొలగించడంతో పందులు, ఆవులు, కుక్కలు తిష్టవేసి అపరిశుభ్రంగా మార్చాయి. దీంతో స్థానికులు పార్కుకు రావడం మానేశారు. ఇప్పటికైనా అధికారులు పార్కుకు ఫెన్సింగ్ వేసి పర్యవేక్షిస్తే పట్టణ వాసులు పార్కుల్లో కాసేపు సేదతీరే అవకాశం ఉంటుందని పలువురు వాపోతున్నారు.



టీఆర్‌నగర్ పార్కులో తిష్టవేసిన పందులు

పూల సోయగం



రోడ్డు పక్కన ఆకట్టుకుంటున్న తురాయి పూల చెట్లు

కొలిమిగుండ్ల సబ్‌స్టేషన్ నుంచి బెలుం గుహల వరకు రోడ్డుకు ఇరువైపులా నాటిన తురాయి పూల చెట్లు ప్రత్యేక అకర్షణగా నిలుస్తున్నాయి. ఏడాదిన్నర కిందట రామ్‌కో సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో సామాజిక బాధ్యత కింద చెట్ల పెంపకం చేపట్టారు. ప్రస్తుతం చెట్లు పెద్దవి అయ్యాయి. వేసవిలో తురాయి చెట్లకు ఎర్రటి పూలు పూయడంతో అందంగా కనిపిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో కళకళలాడుతూ కనిపిస్తున్నాయి. రాకపోకలు సాగించే వాహనదారులు ఎర్రని పూల చెట్లను చూసి ఆస్వాదిస్తున్నారు.

–కొలిమిగుండ్ల